మర్యాద పూర్వక కలయిక



హరియాణా గవర్నర్ దత్తాత్రేయతో బీజేపీ నేతలు

మేడ్చల్‌రూరల్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను మంగళవారం బీజేపీ నేతలు కలిశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్‌ముదిరాజ్‌లు నగరంలో గవర్నర్‌ను కలిశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కీసర: శ్రీభవానీ నాగలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కీసర మండల ఎంఈవో జమదగ్నిలు హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. అరవింద్ మాస్టర్, కూరపాటి నాగేశ్వర్‌రావు, బలవంతరావు, సూర్యశేఖర్‌రెడ్డి, నర్సింగ్, కృష్ణయాదవ్ తదితరులున్నారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి బాసురేగడి గ్రామంలోని సెయింట్ క్లారెట్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం మాజీ కౌన్సిలర్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ నోట్‌బుక్స్ అందజేశారు. పేద విద్యార్థులకు కాంగ్రెస్ నేతలతో కలిసి పుస్తకాలను పంపిణీ చేశారు. నాయకుల కోమలత, శిల్ప, అబ్రార్‌ఖాన్, విజయ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

3 నెలలుగా వేతనాలు లేవు !

'1962' సంచార పశువైద్యశాల ఉద్యోగుల ఆవేదన

మేడ్చల్: జిల్లాలోని సంచార పశువైద్యశాల '1962'లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం గత 3 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ.. సంస్థ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్‌లో సంచార పశువైద్యశాల వాహనం వద్ద నిరసన చేపట్టారు. వేతనాలు చెల్లించకున్నా.. తాము జిల్లాలోని మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వేతనాలపై ఆధారపడి జీవించే ఉద్యోగులకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో జీవితం ఆర్థికభారమైందన్నారు. ప్రభుత్వం తమ గురించి పట్టించుకోవాలని ఉద్యోగులు కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



కీసర: కీసర ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనదారులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు.

రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపు

మేడ్చల్: మేడ్చల్ హౌజింగ్ బోర్డు రోడ్డులో చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. రోడ్డుపై చిన్న డబ్బాలు, ఇతర వ్యాపారాలు ఏర్పాటు చేసి రోడ్డు కుచించుకుపోవడంతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు జేసీబీల సాయంతో ఆక్రమణలను తొలగించారు. పట్టణ పరిధిలో రోడ్లపై అనధికారికంగా వ్యాపారాలు ఏర్పాటు చేస్తే వారి షెడ్లు, నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు.

రైతు భరోసాకు రూ.5.03 కోట్లు

సాక్షి,సిటీబ్యూరో: రైతు భరోసా పథకం కింద మంగళవారం వరకు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని 5198 మంది రైతుల ఖాతాల్లో రూ. 5.03 కోట్లు జమ అయినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. విడతల వారీగా మిగిలిన రైతుల ఖాతాల్లోకి నిధులు పడతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

అమెరికా దాడులపై సీపీఐ నిరసన

కీసర: ఇరాన్‌పై అమెరికా దాడులకు నిరసనగా మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ ఆర్‌జీకే కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. అంతర్జాతీయ చట్టాలను అమెరికా బేఖాతరు చేస్తూ.. ఇరాన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా దాడులు చేస్తుందన్నారు. ఇరు దేశాలు సంయమనంతో శాంతిచర్చలు జరపాలన్నారు. పరుశురాం, మోహన్, రాము, లక్ష్మణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌కు నిధులు!

- రూ. 400 కోట్లు కేటాయించిన కేంద్రం
- ప్రారంభమైన భూసేకరణ ప్రక్రియ
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్-యాదగిరిగుట్ట రాయగిరి వరకు ప్రతిపాదిత ఎంఎంటీఎస్ మూడో లైన్ నిర్మాణ పనులపై సందిగ్ధత తొలగనుంది. ఎంఎంటీఎస్ రైళ్ల కోసం రాయగిరి వరకు ఇప్పుడున్న 2 లైన్లకు అదనంగా మూడో లైన్ నిర్మించడానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. దీంతో మూడో లైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను రైల్వే, రెవెన్యూ అధికారులు ప్రారంభించారు.

☛ రెండో దశలో మౌలాలి-ఘట్‌కేసర్ మధ్య ఉన్న 12.2 కిలోమీటర్ల మేర ట్రాక్ పనులు పూర్తికావడంతో గతేడాది మార్చి 5 నుంచి ఎంఎంటీఎస్ రైళ్లు నడుస్తున్నాయి. ఎంఎంటీఎస్ నిర్మాణ సంస్థ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) ఆధ్వర్యంలో ఘట్‌కేసర్-యాదగిరిగుట్ట రాయగిరి వరకు 34 కిలోమీటర్ల మేర కొత్తలైన్ పొడిగించి విద్యుదీకరించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం.

నెలరోజుల క్రితం కేటాయింపులు..

ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టడానికి నెల రోజుల క్రితం కేంద్రం రూ. 400 కోట్లను కేటాయించింది. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలు పొడిగించడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ్మస్వామి భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తుల కోసం ఎంఎంటీఎస్ ప్రాజెక్ట్...

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు ఎంఎంటీఎస్ రైళ్లు అందుబాటులోకి తీసుకురావాలని రెండోదశలో రాయగిరి వరకు విస్తరించాలని ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా చెల్లించడం ఆలస్యం చేయడంతో ఇన్నాళ్లు పనులు సాగలేదు. ప్రస్తుతం ఉన్న రెండు లైన్లపై ఒత్తిడిని నివారించేందుకు మూడో లైన్ నిర్మిస్తున్నారు. తక్కువ డబ్బుతో ప్రయాణించే అవకాశం కోసం పేదలు ఎదురు చూస్తున్నారు.

పెరగనున్న రవాణా సౌకర్యం...

పెరిగిన జనాభాకు అనుగుణంగా రవాణా సౌకర్యం కల్పించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఘట్‌కేసర్ నగరానికి సమీపంలో ఉండటం విద్య, ఉపాధికి ఇతర జిల్లాల నుంచి భారీగా వలసలు ఉంటాయి. దీనికితోడు వందలాది కాలనీలు, పదులు సంఖ్యలో ఇంజినీరింగ్ కళాశాలలు, ఇన్ఫోసిస్, రహేజాలాంటి అంతర్జాతీయ వ్యాపార సంస్థల రాకతో జనాభా విపరీతంగా పెరిగింది. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణతో ఎన్ఎఫ్‌సీనగర్, అంకుషాపూర్, అవుషాపూర్, కొండమడుగు గ్రామాల్లో స్టేషన్లు పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రయాణికుల సమయం, డబ్బు ఆదా కానున్నాయి. ఘట్‌కేసర్-యాదగిరిగుట్ట రాయగిరి వరకు ఎంఎంటీఎస్ పూర్తి చేయడానికి కేంద్రం నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



గత ప్రభుత్వం యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలు పెంచాలని నిర్ణయించింది. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలి. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలు పెంచడంతో పేదలకు మేలు జరుగుతుంది.

– పన్నాల కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత

రవాణా సదుపాయం పెరుగుతుంది



యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ విస్తరణతో భక్తులకు రవాణా సౌకర్యం మెరుగువుతుంది. దీంతో ఇతర రవాణా సౌకర్యాలపై ఒత్తిడి తగ్గుతుంది. భక్తులకు ఎంఎంటీఎస్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.

– కట్ట రాజశేఖర్‌రెడ్డి, బొక్కోనిగూడ

రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



యాదగిరిగుట్ట రాయగిరి వరకు ఎంఎంటీఎస్ పనులపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. పనులు పూర్తైతే ఎంఎంటీఎస్ స్టేషన్లు పెరిగే అవకాశం ఉంది. రవాణా పెరగడంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ప్రయాణికుల సమయం, డబ్బు ఆదా అవుతుంది. ప్రభుత్వ వైఖరితోనే పనులు ఆలస్యమవుతున్నాయి.

– ప్రవీణ్‌రావు, అంకుషాపూర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. 11కేవీ శివాజీనగర్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సంతోష్‌నగర్, సుక్కమ్మకుంట, విఘ్నేశ్వరకాలనీ, భద్రయ్యవెంచర్, సుభద్రమ్మ కాలనీ, 11కేవీ సంతోష్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంతోష్‌నగర్, చెన్నాపురం ప్రధాన చౌరస్తా, బీజేఆర్‌నగర్, పాపయ్యనగర్, నందమూరినగర్, సత్యనారాయణకాలనీ, మల్లిఖార్జుననగర్, దుర్గాభవానీకాలనీ, జ్యోతిరావుకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు ప్రకటించారు.

గురుకుల మహిళా కళాశాలలో దరఖాస్తు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ డిగ్రీ (భువనగిరి) మహిళా కళాశాలలో 2025–26 విద్యా సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత తెలిపారు. ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ, బీఏ, బీకామ్ (సీఏ)లో ఎస్సీ, ఓసీ, మైనారిటీ సీట్లకు ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు పదోతరగతి, ఇంటర్ మెమోలు, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలతో 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 7981199283, 7995010687.

మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ల బదిలీ



నూతన కమిషనర్ వెంకట్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న నాగిరెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. నాగిరెడ్డి మేడ్చల్ నుంచి బదిలీ చేసి నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది.

☛ మేడ్చల్ మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి పదోన్నతిపై మెప్మా పీడీగా వెళ్లారు. మంగళవారం సాయంత్రం నాగిరెడ్డి మేడ్చల్ నుంచి రిలీవ్ అయ్యారు.

నూతన కమిషనర్‌గా చంద్రప్రకాష్‌రెడ్డి

మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా చంద్రప్రకాష్‌రెడ్డి బదిలీపై వచ్చారు. మీర్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కండ్లకోయ పంచాయతీ కార్యదర్శి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ మేనేజర్‌గా పనిచేశారు.

దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా వెంకట్‌రెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా వెంకట్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన నాగమణి బదిలీపై మున్సిపల్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయినట్లు సమాచారం. ఈ మేరకు దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట్‌రెడ్డిని మంగళవారం పలువురు కాంగ్రెస్ నేతలు అభినందించారు.

బీసీ మహాసభకు తరలిన ఆర్టీసీ ఉద్యోగులు

మేడ్చల్: ఆర్టీసీలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల ఐక్యతకు నగరంలో నిర్వహించిన బీసీ మహాసభకు మేడ్చల్ డిపోలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మేడ్చల్ డిపోకు చెందిన బీసీ వర్గానికి చెందిన కండక్టర్లు, డ్రైవర్లు ఇతర ఉద్యోగులు మేడ్చల్ నుంచి ఆర్టీసీ బస్సుల్లో నగరానికి చేరుకున్నారు.

మెప్మా మహిళల స్ట్రీట్ ఫెస్టివల్

మేడ్చల్: మున్సిపాలిటీకి చెందిన స్వయంసహాయక సంఘాల మహిళలు మేడ్చల్‌లో 'స్ట్రీట్ ఫెస్టివల్'ను ప్రారంభించారు. మేడ్చల్ ఉమానగర్‌లో ప్రతీ మంగళవారం నిర్వహించే వారాంతపుసంతలో పొదుపు సంఘాల మహిళలు తయారుచేసిన తినుబండారాలతో శిబిరం ఏర్పాటు చేసి విక్రయించారు. మెప్మా ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసి, ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వివిధ రకాల తినుబండారాలను విక్రయించారు.

ప్రోటోకాల్ పాటించడం లేదని..

కాంగ్రెస్ నేతలపై బీజేపీ ఫైర్

ఘట్‌కేసర్: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామతీర్థ, చంద్రశేఖర్‌ముదిరాజ్, రాధిక, కిశోర్‌గౌడ్, నరేష్‌ముదిరాజ్, మమత శర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి

బీజేపీ ఈస్ట్ శాఖ నూతన కార్యవర్గం

జవహర్‌నగర్: కార్పొరేషన్ బీజేపీ ఈస్ట్‌శాఖ నూతన కార్యవర్గసభ్యులను మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, జవహర్‌నగర్ ఈస్ట్ మండల ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొమ్మిడి శోభారెడ్డి ఆదేశానుసారం జవహర్‌నగర్ ఈస్ట్ శాఖ అధ్యక్షులు జోగారావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా లలిత, రాజు, రఘురాంచారి, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా యాదగిరి, అనీల్‌కుమార్‌గుప్తా, కార్యదర్శులుగా మచ్చ అశోక్, సదానందం, మహేందర్, కనకరాజు, కోశాధికారిగా మదన్‌లాల్‌లను ఎన్నుకున్నారు. మహిపాల్‌రెడ్డి, మహేందర్, కమల్, మహేశ్వర్‌గౌడ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో 'మా కే నామ్ పే ఏక్ పేడ్'

కీసర: మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీవేణుగోపాల్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మంగళవారం నాగారం మున్సిపాలిటీ ఆర్ఎల్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద 'అమ్మ పేరుతో ఓ మొక్క' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి హాజరై మొక్కలు పంపిణీ చేసి మొక్క నాటారు. జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్యామ్‌సుందర్‌శర్మ, మండలం, మున్సిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.



నాగారంలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

నారపల్లి పార్కును పరిరక్షించండి !

పోచారం: నారపల్లిలోని సర్వేనెంబర్లు 27, 28లో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఎకరం స్థలంలో జైన్ కన్‌స్ట్రక్షన్స్ భవన నిర్మాణాలను చేపట్టిందని పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డికి స్థానిక నాయకుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. శ్రీరాంనగర్ కాలనీ పేరుతో ఏర్పాటు చేసిన వెంచర్‌లో పార్కు, స్కూల్, కమ్యూనిటీహాల్ వంటి ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన స్థలంలో నిర్మాణాలు కొనసాగుతున్నాయని వివరించారు. సుమారు రూ. 15కోట్ల విలువైన భూమి కబ్జాకు గురవుతోందని చెప్పారు. చట్టరిత్యా స్థలాన్ని మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని కోరారు. కమినషర్ స్పందిస్తూ.. సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

గురుకుల స్కూల్‌లో 'విద్యా శిబిరం'

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యా శిబిరం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్‌జీఓ వాయిస్ 4 గరల్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యా శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. స్కూల్ ప్రిన్సిపాల్ లలిత ప్రారంభించారు. పది రోజుల పాటు శిబిరం నిర్వహించి విద్యార్థులకు 'హర్ వాయిస్' పేరుతో చైతన్యపరుస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య ఆవశ్యకత, బాలికలకు అవసరమైన జ్ఞానం, జీవిత నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. శిబిరం వాయిస్ 4 గరల్స్ సంస్థ ప్రతినిధులు ప్రియాంక, సంకీర్తన, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

డీఎంహెచ్‌ఓ ఉమాగౌరీ

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని యూపీహెచ్‌సీలు, వెల్‌నెస్ సెంటర్లలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేయడానికి అర్హత కలిగిన ఎంబీబీఎస్ డాక్టర్లను ఎంపిక చేయడం జరుగుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఉమాగౌరీ తెలిపారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ నమోదు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నియామకం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ పద్ధతులపై ఉంటుందన్నారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 13 డాక్టర్ పోస్టులు, కూకట్‌పల్లిలోని హెల్త్ - వెల్‌నెస్ సెంటర్లలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఈనెల 27న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వీకరిస్తారన్నారు. అభ్యర్థులు తమ పూర్తి దరఖాస్తు ఫారం, అవసరమైన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రూ.500 విలువైన డిమాండ్ డ్రాఫ్ట్‌తో మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి కార్యాలయంలో స్వయంగా సమర్పించాలన్నారు.

రక్తదానం.. ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల కార్యదర్శి టీవీరెడ్డి మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో వైద్యులు 80 యూనిట్ల రక్తాన్ని స్వీకరించారు. వైద్య శిబిరంలో కంటి, దంతపరీక్ష, షుగర్, రక్తపోటు, హిమోగ్లోబిన్, ఎముక, కండరాల కొవ్వు పరీక్ష, కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో రవి, సుధాకర్, రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ముగిసిన కమిషనర్ల ఓరియంటేషన్ ప్రోగ్రాం

మేడిపల్లి: రాష్ట్రంలోని ఆయా మున్సిపాలిటీలకు పదోన్నతి ద్వారా త్వరలో కమిషనర్లుగా వివిధ మున్సిపాలిటీల్లో బాధ్యతలను చేపట్టనున్న 25 మందికి మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఒక్కరోజు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసినట్లు కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్‌లోని వివిధ అంశాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా నూతనంగా నియామకమైన కమిషనర్లకు వివరించడం జరిగిందన్నారు. అనంతరం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పర్వతాపూర్ డంపింగ్ యార్డును సందర్శించారు. డంపింగ్ యార్డులోని వ్యర్థాల నిర్వహణ, తడి,పొడిచెత్తను పూర్తిస్థాయిలో వేరుచేసేవిధానం, తడివ్యర్థాల ద్వారా బ్రిక్స్ తయారీ, కంపోస్టు ఎరువుల తయారీ వంటి అంశాలపై వారికి వివరించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డీఈ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్‌కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ సుమలత, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఇన్విరాన్‌మెంట్ ఇంజినీర్ బాల మురళీకృష్ణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పార్టీల దిమ్మెలు తొలగించాలి

పోచారం: అన్నోజిగూడలోని పలు దేవాలయాల వద్ద రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన జెండా దిమ్మెలను ఇతర ప్రాంతాలకు తరలించాలని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో ఆలయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఆలయానికి ఎదురుగా ఉన్న బీజేపీ, టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ జెండా దిమ్మెలను తొలగించి, సొంత ఖర్చులతో పునర్నిర్మిస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు సూచించిన చోటే దిమ్మెలను తిరిగి నిర్మిస్తామన్నారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా హామీ కూడా ఇస్తామని వివరించారు. ఆలయాలను ఏ పార్టీతో సంబంధంలేనందున దిమ్మెలను తొలగించేందుకు ఆలయ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. గుడికి 100 మీటర్ల పరిధిలో రాజకీయపార్టీలకు చెందిన ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించొద్దని కోరారు. చట్టబద్ధంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేస్తాం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి

సాక్షి,సిటీబ్యూరో: వనమహోత్సవం లక్ష్యానికి అనుగుణంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రత్యేక శ్రద్ధతో పూర్తిస్థాయిలో మొక్కలు నాటుతామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ నుంచి అటవీపర్యావరణశాఖ మంత్రి కొండాసురేఖ హాజరు కాగా.. మేడ్చల్ కలెక్టర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లు, ఎరువుల లభ్యత, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు విషయాలను చర్చించారు. అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, జిల్లా అధికారులు ఉమాగౌరీ, చంద్రకళ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



రైతు వేదిక నుంచి సీఎం సభను తిలకించిన కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: రైతు నేస్తం కార్యక్రమాన్ని 8 రైతు వేదిక కేంద్రాలలో నిర్వహించినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శామీర్‌పేట్, సింగాయిపల్లి, కీసర, యాద్గార్‌పల్లి, ప్రతాపసింగారం ఘట్‌కేసర్, మేడ్చల్, మూడుచింతలపల్లి మండలాల్లో రైతువేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి రైతువేదిక నుంచి సెక్రటేరియట్ వద్ద ఏర్పాటు చేసిన రైతునేస్తం సీఎం రేవంత్‌రెడ్డి సభను ఆయన తిలకించారు. జిల్లా నుంచి 800 మంది రైతులు రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387